అధ్వానంగా రహదారి

- ఇబ్బందులు పడుతున్న రైతులు, గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు


బురదమయంగా ఉన్న రోడ్డు

చిట్యాల: మండల కేంద్రంలోని చలివాగుకు వెళ్లే దారి వర్షానికి బురదమయంగా మారింది. ప్రతీ రోజు పంట పొలాలకు వెళ్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలపై ఎరువులు తీసుకెళ్లాలంటే అవస్థలు పడాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంత కాలంగా ఈ రోడ్డును బాగుచేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిపిన పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన గ్రామస్తులు ఎవరైనా మృతి చెందితే ఈ దారి గుండానే అంతిమ యాత్రగా చలివాగుకు తీసుకుపోవాలి. రోడ్డు అధ్వానంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చలివాగుకు వెళ్లే దారిని మరమ్మతు చేయాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

పొలానికి వెళ్లాలంటే ఇబ్బందే..



చిట్యాల శివారులో రెండు ఎకరాల పొలం ఉంది. పొలానికి కావాల్సిన ఎరువులు ద్విచక్రవాహనంపై తీసుకుపోవాలంటే ఇబ్బంది పడుతున్నా. ఈ రోడ్డును ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి త్వరితగతిన రోడ్డుకు మరమ్మతు చేసి బాగు చేయాలి.

\- గుర్రపు రాజు, రైతు, చిట్యాల

రోడ్డు వేయించాలి



చిట్యాల శివారు చలివాగుకు వెళ్లే దారి అధ్వానంగా ఉంది. ఈ దారి గుండానే రైతులు పంట పొలాలకు వెళ్లాలి. వానకాలం వస్తే రోడ్డు మొత్తం బురదమయంగా మారి ఇబ్బంది పడుతున్నాం. అధికారులు, పాలకులు పట్టించుకుని రోడ్డును వేయించాలి.

\- నర్సింహరాములు, రైతు, చిట్యాల

అవస్థలు పడుతున్నాం..



గ్రామంలో ఎవరైనా మృతి చెందితే చలివాగుకు తీసుకెళ్లి అంత్యక్రియలు చేయాలి. కానీ దారి సక్రమంగా లేకపోవడంతో అనేక అవస్థలు పడుతున్నాం. గతంలో రోడ్డు సరిగా లేకపోతే డోజర్‌తో చదును చేసి రోడ్డుకు మరమ్మతులు చేశాం. కానీ వర్షాకాలం వస్తే ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు, పాలకులు స్పందించి చలివాగుకు వెళ్లేందుకు రోడ్డు వేయించాలి.

\- భైరం భద్రయ్య, చిట్యాల

క్లుప్తంగా

దరఖాస్తుల స్వీకరణ

మల్హర్: ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు మండల కేంద్రం తాడిచర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు తిరుపతిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతిలో చేరడానికి 31 ఆగస్టు 2024 నాటికి 14 సంవత్సరాలు ఉండాలన్నారు. అభ్యర్థులు వారు పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, కులం సర్టిఫికేట్, ఆధార్ కార్డు, రెండు పాస్ ఫొటోలు ఇవ్వాలని తెలిపారు. అలాగే ఇంటర్ ప్రవేశాలకు ఆగస్టు 31, 2024 నాటికి 15 సంవత్సరాలు ఉన్న వారు టెన్త్ క్లాస్ మెమో, కులం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, రెండు పాస్ ఫోటోలు తీసుకొని రావాలని సూచించారు. ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని పూర్తి వివరాలకు నంబర్ 94924 40030 సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు మంత్రి పర్యటన

కాటారం: కాటారం, మహాముత్తారం మండలాల్లో నేడు(సోమవారం) రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పర్యటించనున్నారు. మండల కేంద్రంలోని బీఎల్‌ఎం గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన స్వయం సహాయక మహిళా గ్రూపులకు వడ్డీ లేని రుణాల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్నారు. మహాముత్తారంలో రూ.1.20 కోట్లతో నూతనంగా నిర్మించిన ఎంపీడీఓ కార్యాలయ భవనం, పీఏసీఎస్ భవనాన్ని మంత్రి ప్రారంభించనున్నారు. అనంతరం బోర్లగూడెం నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన, మహాముత్తారం మండల కేంద్రంలో వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొననున్నారు. మంత్రి పర్యటనకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

నేడు మంత్రి రాక

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు నేడు (సోమవారం) ఉదయం 9.30 గంటలకు రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రానున్నట్లు ఆయన పీఏ చంద్రశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన గివ్ ఎన్‌జీఓ ద్వారా 650 మంది విద్యార్థులకు మంత్రి చేతులగా మీదుగా షూస్ అందజేయనున్నారని తెలిపారు.

నేడు విస్తృత స్థాయి సమావేశం

టేకుమట్ల: మండల కేంద్రంలోని పీఎంఆర్‌ఎం కన్వెన్షన్ హాల్‌లో నేడు(సోమవారం) బీఆర్‌ఎస్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

ఏటూరునాగారం: మండలం కేంద్రంలోని వైజంక్షన్ వద్ద ఆదివారం రాత్రి మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన సత్యపాల్ గన్‌సింగ్ యాదవ్(40) అనే లారీ డ్రైవర్ మృతి చెందినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని వై జంక్షన్‌లో రెండు ఇసుక లారీలు ఉండగా అందులో ఒక లారీ డ్రైవర్ అంకూస్ పవర్ లారీని నిర్లక్ష్యంగా రివర్స్ తీస్తుండగా వెనుకాల ఉన్న లారీ డ్రైవర్ సత్యపాల్‌సింగ్ తల రెండు లారీల మధ్య ఇరుక్కొని మృతి చెందాడు. అంకూస్ లారీని రివర్స్ తీసే క్రమంలో ఎలాంటి రక్షణ, జాగ్రత్తలు చర్యలు తీసుకోకుండా నడిపినందుకు అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విరాళం

గీసుకొండ: మండలంలోని మనుగొండ కాష్టాలగడ్డ వెళ్లే దారిలో వంతెన నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి రూ.2.50 లక్షలు విరాళంగా గ్రామస్తులకు అందజేశారు. బాలకిశోర్‌రెడ్డి పంపిన నగదును కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్లం మర్రిరెడ్డి, బగ్గె రవి, తోట కమలాకర్ గ్రామస్తులకు ఆదివారం అందజేశారు. చాపర్తి సాంబయ్య, అగయ్య, మొగిలి ఉన్నారు.

ఇసుక రవాణాపై పోలీసుల నిఘా

- ఐదు ట్రాక్టర్లు, లారీ, జేసీబీ పట్టివేత

కాటారం: మండలంలోని విలాసాగర్ నుంచి ఇతర ప్రాంతాలకు అక్రమంగా నిర్వహిస్తున్న ఇసుక రవాణాపై పోలీసులు నిఘా పెట్టారు. మండలంలో అభివృద్ధి పనులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం విలాసాగర్ మానేరు నుంచి ఇసుక రవాణా కొనసాగుతుంది. ఇదే అదునుగా భావించి పలువురు మండలం నుంచి భూపాలపల్లి, మహాముత్తారం మండలాలకు ఇసుక రవాణాకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో భూపాలపల్లికి చెందిన పలువురు ట్రాక్టర్ యజమానులు ఎలాంటి అనమతులు లేకుండా ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా చేస్తుండగా శనివారం రాత్రి ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. భూపాలపల్లి సమీపంలోని కమలాపూర్ క్రాస్ వద్ద ఐదు ఇసుక ట్రాక్టర్లను అదుపులోకి తీసుకోని విచారించగా ఎలాంటి అనమతులు లేకపోవడంతో ట్రాక్టర్లను సీజ్ చేసి డ్రైవర్లు సంతోష్, తిరుపతి, నవీన్, జనార్ధన్, దారంగుల తిరుపతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జేసీబీ, లారీ సీజ్..

మండలంలోని గంగారం ఎక్స్ రోడ్డు సమీపంలో అక్రమంగా డంప్ చేసిన ఇసుకను తరలిస్తున్న జేసీబీ, లారీని ఆదివారం సీజ్ చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారనే సమాచారం మేరకు సంఘటనా స్థలానికి వెళ్లగా జేసీబీతో లారీలో ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా భూపాలపల్లికి ఇసుక తరలిస్తున్నట్లు నిర్ధారణకు వచ్చి జేసీబీ, లారీ సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. లారీ డ్రైవర్ జయరాజు, యజమాని సుమన్‌రావు, జేసీబీ డ్రైవర్ వినోద్‌కుమార్, ఓనర్ నవీన్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

అపరిచిత వ్యక్తులకు వైద్యం చేయొద్దు


ఆర్‌ఎంపీలతో మాట్లాడుతున్న ఎస్సై రాజు

వెంకటాపురం(ఎం): అపరిచిత వ్యక్తులకు వైద్యం చేయొద్దని ఎస్సై చల్ల రాజు ఆర్‌ఎంపీలకు సూచించారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఆర్‌ఎంపీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుర్తు తెలియని వ్యక్తులకు వైద్యం చేయొద్దని, పేదల నుంచి అధిక ఫీజులు వసూలు చేయొద్దని తెలిపారు. వైద్యం కోసం కొత్త వ్యక్తులు వస్తే పోలీసులుకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఘనంగా మహంకాళి బోనాలు

- ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో ఆదివారం మహంకాళి బోనాల ఉత్సవాలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. మహారాష్ట్రలోని చంద్రాపూర్ తర్వాత తెలంగాణ రాష్ట్రంలో సికింద్రాబాద్, ఉమ్మడి వరంగల్ జిల్లాలో గట్లకానిపర్తిలోనే మహంకాళి మాతా బోనాల ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిబింబంగా బోనాల ఉత్సవాల జాతర నిలుస్తుందన్నా రు. తెలంగాణలో బోనాలకు ఒక ప్రత్యేక స్థానం ఉందని, దేవతలను పూజించేందుకు బోనం ఎత్తే సంప్రదాయం రాష్ట్ర వ్యాప్తంగా ఉందని తెలిపారు. మహంకాళి అమ్మవారి అనుగ్రహంతో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. గట్లకానిపర్తి గ్రామస్తులంతా ఐకమత్యంగా ఉండాలని, గ్రామానికి అవసరమైన అన్ని అభివృద్ధి పనులు చేసేందుకు తన వంతు సహకారం అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం


శిశువును చూపుతున్న 108 సిబ్బంది

మల్హర్: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తున్నా గర్భిణికి మార్గమధ్యలో పురిటినొప్పులు ఎక్కువ కావడంతో 108 సిబ్బంది ప్రసవం చేశారు. మండలంలోని నాచారం గ్రామానికి చెందిన కేతవేణి కేతక్కకి ఆదివారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. అంబులెన్స్ అక్కడికి వెళ్లి చేరుకోని గర్భిణిని నాచారం నుంచి భూపాలపల్లి జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్తున్నారు. మార్గమధ్యలోనే పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్‌లోని టెక్నీషియన్ కొంపల్లి తండా గ్రామ శివారులో రోడ్డు పక్కన వాహనాన్ని నిలిపి ప్రసవం చేశారు. అనంతరం తల్లి శిశువును జిల్లా ఆస్పత్రికి తరలించారు. తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నట్లు సిబ్బంది తెలిపారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ బొమ్మ హరిప్రసాద్, పైలట్ చేరి రవీందర్, కేతక్క భర్త కుమార్ ఉన్నారు.

నిబంధనల ప్రకారమే పట్టా జారీ

ఎస్ఎస్‌తాడ్వాయి: అక్రమంగా అధికారులు పట్టా జారీ చేయలేదని నిబంధనల ప్రకారం తనకు పట్టా జారీ చేశారని రైతు దబ్బకట్ల నారాయణ తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. మండలంలోని ఊరట్టంలోని పోడు భూమిని రెవెన్యూ, అటవీశాఖ అధికారులు సర్వే చేసి గ్రామస్తుల సమక్షంలో పరిశీలన చేసి ఆర్‌ఓఎఫ్ పట్టా జారీ చేశారన్నారు. అక్రమంగా అధికారులు పట్టా జారీ చేశారని ఇటీవల సోషల్ మీడియాలో అసత్యపు ప్రచారం చేశారన్నారు. ఎవరిని బెదిరించి పట్టా చేసుకోలేదని ప్రభుత్వ నిబంధనల ప్రకారం అధికారులు పట్టా జారీ చేశారన్నారు. తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. ఈ విషయంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఒకరికి గాయాలు

మంగపేట: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మండలంలోని బోరునర్సాపురం వద్ద ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డుపై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన సంఘటన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కోరెం కృష్ణ బోరుర్సాపురం నుంచి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. మంగపేట వైపు నుంచి బొలేరో వాహనం వస్తున్న క్రమంలో రెండు వాహనాలు ఢీకొన్నాయి. ద్విచక్ర వాహనంపై ఉన్న కృష్ణ కుడి కాలుకు గాయాలు కావడంతో సమాచారం తెలుసుకున్న బాధితుడి కుటుంబ సభ్యులు మంగపేట పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం పెద్దాస్పత్రికి తీసుకువెళ్లాలని సూచించినట్లు సమాచారం.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


మంజూరు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

చిట్యాల: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన 14 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఆదివారం జిల్లా కేంద్రంలో మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల అభ్యున్నతి కోసం పాటు పడుతుందని అన్నారు. లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లు నిర్మించి పనులను పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు గజ్జి రవి, ప్రధాన కార్యదర్శి మహేష్, చిరంజీవి, కొత్తపల్లి రాము, గోపగాని చిన్న వెంకటేశ్వర్లు, బాలుగ నీలేష్, జన్నె ఓదేలు, కొర్రి అశోక్, భద్రయ్య, తిరుపతి, రాజు, సాంబయ్య, రాజేశ్వరీ, రజిత తదిరుతలు పాల్గొన్నారు.

సమస్యలు ఉంటే సమాచారం ఇవ్వండి


సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

ఏటూరునాగారం: మండలంలోని గ్రామాల్లో ఎవరికైనా సమస్యలు ఉంటే కాంగ్రెస్ పార్టీ నాయకులకు సమాచారం ఇవ్వాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. ఆదివారం మండలంలోని ఎక్కెల గ్రామంలోని గ్రామస్తులతో సమావేశమై మాట్లాడారు. ఎక్కడ ఎలాంటి సమస్యలున్నా కూడా తమ దృష్టికి తీసుకువస్తే మంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు, సైడ్ కాల్వలు, సీసీ రోడ్లు, విద్యుత్ దీపాలు, తాగునీటి సరఫరాలతోపాటు పంట పొలాలకు అంతర్గత రోడ్ల నిర్మాణం కోసం తమవంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవేందర్, లాలయ్య, ఎల్లయ్యతోపాటు నాయకులు తదిరుతలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల రద్దును విరమించుకోవాలి


ఇళ్ల రద్దును విరమించుకోవాలని ఆందోళన చేస్తున్న నాయకులు

ఎస్ఎస్‌తాడ్వాయి: రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలకు కేటాయించిన ఇందిరమ్మ ఇళ్లను రద్దు చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, జెడ్పీ మాజీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్లను రద్దు చేయాలని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని, మంత్రి సీతక్కపై విమర్శలకు నిరసనగా మండలంలోని నార్లాపూర్‌లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నార్లాపూర్ గ్రామానికి ఎన్ని డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించారో నాగజ్యోతి చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామంలో 30 ఇళ్లు కేటాయించారని, మరో పది ఇళ్లు మంజూరు చేస్తానని మంత్రి సీతక్క హామీ ఇచ్చారన్నారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి సీతక్కను విమర్శించడం పనిగా పెట్టుకొని చిల్లర రాజకీయాలు చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు ఇప్ప నాగేశ్వర్ రావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాపోలు సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ ఎనగంటి రామయ్య, గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు ఎనగంటి నరేష్, మాజీ వైస్ ఎంపీపీ బుర్రి అరుణ, నాయకులు మొక్క దుర్గయ్య, కాల్వల సమ్మయ్య, బొజ్జ అరుణ్, మడకం శోభన్, తొలెం సమ్మయ్య, తోలెం కృష్ణ, సమ్మయ్య, ఆకుల సమ్మయ్య, కారెంగుల రాంబాబు, సునావత్ శ్రీను, నర్సయ్య, రజిత, రాజమ్మ, అనుష పాల్గొన్నారు.

‘కాంగ్రెస్ నాయకుల ధర్నా విడ్డూరం’

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని నార్లాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ధర్నా చేయడం విడ్డూరంగా ఉందని బీఆర్‌ఎస్ పార్టీ మండల సమన్వయ కార్యకర్త జీడీ బాబురావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డబ్బులు తీసుకుని అనర్హులకు ఇళ్లు కేటాయించారని బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి నార్లాపూర్‌లో ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు తప్పును కప్పిపుచ్చుకునేందుకు బీఆర్‌ఎస్ పార్టీ, నాగజ్యోతిపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. అనర్హులకు ఇళ్లు కేటాయించిన విషయంపై ప్రభుత్వ ఉన్నతాధికారులు విచారణ చేయాలన్నారు. పేదలకు ఇళ్లు కేటాయించాలని అర్హుల పక్షన నాగజ్యోతి మాట్లాడుతున్నారని పేదలు గమనించాలన్నారు.

తీన్మార్ మల్లన్న క్షమాపణ చెప్పాలి

- జాగృతి యువత రాష్ట్ర నాయకుడు అశోక్

శాయంపేట : పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై చేసిన వ్యాఖ్యలు మహిళా సమాజాన్ని కించపరిచే విధంగా ఉన్నాయని వెంటనే మహిళా సమాజానికి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న క్షమాపణ చెప్పాలని జాగృతి యువత రాష్ట్ర నాయకుడు అమ్మ అశోక్ డిమాండ్ చేశారు. మండలంలోని పెద్దకోడెపాకలో ఏర్పాటు చేసిన జాగృతి ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తీన్మార్ మల్లన్న కవితపై చేసిన అనుచితమైన వ్యాఖ్యలను ఖండిస్తూ ఎమ్మెల్సీ కవిత అభిమానులు, జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ నాయకులు నిరసన తెలుపడానికి తీన్మార్ మల్లన్న ఆఫీసుకు వెళ్తే తన గన్‌మెన్‌లతో కాల్పులు చేయించి గాయపరిచారని తెలిపారు. తీన్మార్ మల్లన్న ఆఫీస్‌కు నిరసన తెలుపడానికి బీసీ బిడ్డలే వచ్చారని తెలిసి కూడా వారిపై దాడులు చేయించడం సిగ్గుచేటన్నారు. క్రిమినల్ ఆలోచనలు ఉన్న తీన్మార్ మల్లన్న బీసీలకు ఏం న్యాయం చేయగలరని, మహిళలపై గౌరవం లేని తీన్మార్ మల్లన్నపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు గొట్టె అజయ్, పోతురాజు మనోజ్, వరుణ్, జస్వంత్ పాల్గొన్నారు.

బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు



ముత్యాలమ్మకు బోనాలు

మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి గ్రామంలో ఆదివారం ముత్యాలమ్మకు బోనాలను సమర్పించారు. గ్రామంలోని మహిళలంతా బోనాలతో గ్రామ సమీపంలోని ముత్యాలమ్మ గుడికి వెళ్లారు. ప్రత్యేక పూజలు చేశారు.

వాజేడు

జాడలేని వర్షాలు


కరేద అలుకుతున్న రైతులు


ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

- చినుకు కోసం రైతుల ఎదురు చూపు
- అయోమయంలో అన్నదాతలు

వాజేడు: వర్షాకాలం ప్రారంభమైన సరైన వానలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆశించిన స్థాయిలో వర్షాలు కురువక పోవడంతో ఆందోళన చెందుతూనే పనులను ప్రారంభించారు. మండలంలో అప్పుడప్పుడు చిరు జల్లులు పడ్డాయి. పడిన చిరు జల్లులకు పొలాలను దున్నడంతో పాటు మిర్చి సాగుకు భూమిని కలియదున్నారు. కాని ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో వర్షాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. వ్యవసాయ బోర్ల కింద నారు పోసి పొలాలను దున్ని సిద్ధం చేస్తున్నారు. కాగా, వరి నాట్లు వేయడానికి రైతులు సిద్ధంగా ఉన్నప్పటికీ వర్షాల జాడ కానరావడం లేదు. అసలు వర్షాలు కురుస్తాయా అనే అనుమానాలు రైతన్నలను అయోమయానికి గురి చేస్తున్నాయి. మండలంలో ఇప్పటి వరకు సాధారణ వర్ష పాతం కూడా నమోదు కాలేదు. బోర్లు, వాగులు, వంకలు ఉన్న రైతులకు కొంత వరకు పర్వాలేక పోయినా వర్షాలపై ఆధారపడి పంటలను సాగు చేసే రైతులు అయోమయంలో ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


నివాళులర్పిస్తున్న నాగజ్యోతి

ములుగు రూరల్: మండలంలోని జగ్గన్నపేట గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు యువరాజు తల్లి గుండెకారి రాధమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి ఆదివారం పరామర్శించారు. రాధమ్మ మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేశ్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు పోరిక విజయ్‌రాంనాయక్, మద్ది సంపత్, అజ్మీరా సర్దార్, నూనేటి శ్రీనివాస్, సురేష్, కుమారస్వామి, రమేశ్, అఖిల్, చంటి తదితరులు ఉన్నారు.